

శ్రీ చైతన్యా...? అరబిందోనా...?

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103

సంపుటి - 3 సంచిక -58 శుక్రవారం 31 జులై 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు 5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts



## బస్ టికెట్‌తో పాటే ఆటో బుకింగ్..

టీజీఎస్ఆర్టీసీ సరికొత్త సేవలు.. తక్కువ ఛార్జీలతో ఎలక్ట్రిక్ ఆటోలు

ప్రయాణికుల కోసం 'ఫస్ట్ మైల్, లాస్ట్ మైల్' కనెక్టివిటీకి ఆర్టీసీ శ్రీకారం

ఇంటి నుంచి బస్టాప్‌కు, బస్టాప్ నుంచి గమ్యానికి ఈ-ఆటో సేవలు

బస్ టికెట్‌తో కలిపి ఆటో రైడ్ బుక్ చేసుకునే ప్రత్యేక సౌకర్యం

మొదట హైదరాబాద్‌లో ప్రయోగాత్మకంగా,

తర్వాత ఇతర నగరాలకు విస్తరణ

ప్రైవేట్ యాప్‌ల కన్నా తక్కువ ఛార్జీలతో సేవలు అందించేలా ప్రణాళిక

**హైదరాబాద్ జూలై 30 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో ప్రజా రవాణాను మరింత సులభతరం చేసే దిశగా టీజీఎస్ఆర్టీసీ మరో విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. బస్సు ప్రయాణికులకు ఇంటి నుంచి బస్ స్టాప్ వరకు, బస్సు దిగాక గమ్యస్థానం వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణాన్ని కొనసాగించేందుకు 'ఫస్ట్ మైల్ టు లాస్ట్ మైల్' కనెక్టివిటీ విధానాన్ని అమలు చేయనుంది. ఇందులో భాగంగా త్వరలోనే రాష్ట్రంలో ఎలక్ట్రిక్ ఆటోలను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ప్రముఖ ఎలక్ట్రిక్ ఆటో తయారీ కంపెనీలతో ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారు. మిగతా 2లో...

# ఉపాధ్యాయులదే భావితరం బాధ్యత

నాణ్యమైన విద్యకోసంఏం చేయాలో మీరే చెప్పండి

ఒక్కో విద్యార్థిపై రూ.1.8 లక్షలు ఖర్చు చేస్తున్నా

తల్లిదండ్రులు ఎందుకు ప్రయివేటుకు పంపుతున్నారో ఆలోచించండి

టీచర్ల సమస్యలు పరిష్కరించే బాధ్యత నాదే

ఫిన్‌లాండ్, జర్మనీ దేశాల్లో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయ బృందంతో

సీఎం రేవంత్ రెడ్డి ముఖాముఖి



**హైదరాబాద్ జూలై 30 (జర్నలిస్ట్ వార్త):** దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందనీ, దాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. వారిద్దరి బాధ్యతను తానే స్వయంగా తీసుకుంటానన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామనీ, అదే సమయంలో ఉపాధ్యాయ సంఘాలు వారి కోసం కాకుండా విద్యార్థుల కోసం పోరాడాలని సూచించారు. గత ప్రభుత్వంలో ఏనాడూ 1వ తేదీ జీతాలివ్వలేదని గుర్తు చేశారు. ఆ పరిస్థితిని తాము మార్చామన్నారు. ప్రభుత్వం కోసం పని చేసే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలివ్వకపోతే అది పాలకుల వైఫల్యమేనని గుర్తించి, మిగతా 2లో...



## తెలంగాణ జలాశయాలకు పోటెత్తుతున్న వరద...

తెలంగాణలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు

ఉప్పొంగి ప్రవహిస్తున్న నదులు, వాగులు, వంకలు

జూరాల, శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూరు ప్రాజెక్టులకు భారీగా వరద నీరు

**హైదరాబాద్‌జూలై 30 (జర్నలిస్ట్ వార్త)::** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నదులు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రధాన జలాశయాలకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతుండటంతో పాటు జూరాల, శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూరు ప్రాజెక్టుల నీటిమట్టాలు వేగంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జలపాతాలు, నదీ తీర ప్రాంతాల వద్ద పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. మిగతా 2లో...




# ఆంధ్ర నుంచి విదేశాలకు క్లీన్ ఎనర్జీ

## పత్తికొండ సమీపంలో టాటా రెన్యువబుల్ ఎనర్జీ శంకుస్థాపన సభలో మంత్రి నారా లోకేష్

ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల ఎంపిక ఆంధ్రప్రదేశ్: మంత్రి నారా లోకేష్

గత ప్రభుత్వ చర్యలతో పెట్టుబడిదారుల విశ్వాసం కోల్పోయిందని వ్యాఖ్య

పరిశ్రమలు తేవడం మా బాధ్యత.. కష్టపడటం యువత బాధ్యత




**పత్తికొండ జూలై 30 (జర్నలిస్ట్ వార్త):** ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల తొలి ప్రాధాన్యతగా మారిందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. బ్రూక్‌ఫీల్డ్, బ్లాక్‌స్టోన్, బ్లాక్‌రాక్, ఈక్యూటీ, టీపీజీ వంటి ప్రతిష్టాత్మక గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ ఫండ్‌లు ఏపీలో పెట్టుబడులు పెడుతున్నాయని, మిగతా 2లో...

# రాజ్యసభలోనూ బిల్లు ఆమోదం

## రాష్ట్రపతి ఆమోదం లభించిన వెంటనే అమల్లోకి చట్టం

గరిష్ఠంగా రూ.10 కోట్ల జరిమానా -జైలు శిక్ష, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ

ఎన్‌టీఏపై ప్రతిపక్షం విమర్శలు -సమగ్ర సంస్కరణలపై కొనసాగుతున్న డిమాండ్



**న్యూఢిల్లీ,జూలై 30 (జర్నలిస్ట్ వార్త):** దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, పేపర్ లీక్‌లను అరికట్టడం లక్ష్యంగా తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026కు పార్లమెంట్ ఆమోదం లభించింది. ఇప్పటికే లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లుకు గురువారం రాజ్యసభలోనూ ఆమోదం లభించింది. దీంతో రాష్ట్రపతి అంగీకారం లభించగానే ఇది చట్టంగా అమల్లోకి రానుంది. మిగతా 2లో...

# వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు

అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి పొంగులేటి



**హైదరాబాద్,జూలై 30 (జర్నలిస్ట్ వార్త):** వాయుగుండం ప్రభావం నేపథ్యంలో భారీ వర్ష్యాలు కురిసే అవకావంఉండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఛత్తీస్‌గఢ్ మీదుగా పయనిస్తున్న తీవ్ర వాయుగుండం, చురుగ్గా ఉన్న నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెలంగాణవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక చేసింది. ఈ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో రెవెన్యూ యంత్రాంగంమిగతా 2లో...

# బీజేపీలో చేరకపోతే.. అంతు చూస్తామన్నారు

## సీజేపీ నేత దీప్కే సంచలన ఆరోపణలు

ప్రధాని పదవిని మరొకరికి ఇచ్చి సోషల్ మీడియా

ఇన్‌ఫ్లూయెన్సర్‌గా మారాలి.. మోదీకి సూచన

అమిత్‌షా ఆదేశాలతోనే విద్యార్థులపై దాడులు

ఆయన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్

విద్యార్థులపై వేధింపులను నిలిపివేయాలి

లేదంటే ప్రభుత్వాన్నే మార్చేస్తాం.. దీప్కే హెచ్చరిక



**న్యూజూలై 30 (జర్నలిస్ట్ వార్త):** బీజేపీలో చేరకపోతే అంతుచూస్తామంటూ తనను బెదిరించారని కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే సంచలన ఆరోపణలు చేశారు. తన స్వస్థలమైన మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్‌లో గురువారంమిగతా 2లో...

# ఆంధ్ర నుంచి విదేశాలకు క్లీన్ ఎనర్జీ

**మొదటిపేజీ తరువాయి**

టాటా పవర్, సుజ్లాన్, రెన్యూ, ప్రీమియర్ ఎనర్జీస్, ఏసీఎంఈ, వారీ వంటి ప్రముఖ భారతీయ దిగ్గజ సంస్థల తమ కార్యకలాపాలను ఇక్కడ విస్తరిస్తున్నాయని ఆయన వెల్లడించారు. పత్తికొండ సమీపంలోని హోసూరు వద్ద టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ (టీపీఆర్ఈఎల్) ఆధ్వర్యంలో రూ.5,350 కోట్లతో అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఏర్పాటు చేయనున్న 800 మెగావాట్ల క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు గురువారం మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, గత ఏడాదితో పోలిస్తే ఈ ఒక్క ఏడాదిలోనే ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 400 శాతం పెరిగిందని, రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న విశ్వసనీయత వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు.

**పెట్టుబడిదారుల్లో నమ్మకం పెంపొందించాం**

"రాష్ట్రంలో 2024 జూన్ లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు, పునరుత్పాదక ఇంధన రంగం పూర్తిగా అస్తవ్యస్తంగా ఉండేది. అంతకుముందు ఐదేళ్లలో కనీసం ఒక్క మెగావాట్ సామర్థ్యం గల ప్రధాన రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు కూడా ప్రారంభించలేదు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేశారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం దెబ్బతింది. ప్రపంచంలోని అనేక అతిపెద్ద ఇన్‌ఫ్రా, క్లైమెట్ ఫండ్స్ ఆంధ్రప్రదేశ్‌ను బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాయి. ఒకసారి దెబ్బతిన్న విశ్వాసాన్ని పునరుద్ధరించడం రాత్రికి రాత్రే సాధ్యంకాదు. పెట్టుబడిదారుల్లో మళ్లీ నమ్మకాన్ని పెంపొందిస్తూ వచ్చాం" అని పేర్కొన్నారు.

**ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీతో తొలిఅడుగు**

ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ - 2024ను ప్రవేశపెట్టి విస్తృతమైన విజన్‌తో 160 గిగావాట్ల క్లీన్ ఎనర్జీ సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని అన్నారు. సోలార్ మాడ్యూల్స్, సెల్స్ నుండి బ్యాటరీలు, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, ట్రాన్స్ మిషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, పోర్ట్స్, స్టోరేజీ సిస్టమ్స్.. ప్రపంచ స్థాయి తయారీ వరకు - మొత్తం క్లీన్ ఎనర్జీ సప్లయ్ చైన్ ను ఆంధ్రప్రదేశ్ లో నిర్మించాలని అనుకున్నామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ ఇంధనాన్ని వినియోగించుకోవడమే కాకుండా, క్లీన్ ఎనర్జీ టెక్నాలజీలకు గ్లోబల్ ప్రొడ్యూసర్ గా మారాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని లోకేష్ తెలిపారు.

**టాటా రెన్యువబుల్ ప్రాజెక్ట్.. మా విజన్ కు నిదర్శనం**

"టాటా రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ రూ. 5,750 కోట్ల పెట్టుబడితో, పత్తికొండలో 400 మెగావాట్ల సౌర విద్యుత్‌ను, అనంతపురం జిల్లా కనేకల్లులో 400 మెగావాట్ల పవన విద్యుత్‌తో కలిపి, 800 మెగావాట్ల హైబ్రిడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టుగా అవతరించబోతోంది. ఈ ఒక్క ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో దాదాపు 4,000 ఉద్యోగాలను కల్పిస్తుంది. 3,400 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో గల ఈ ప్రాజెక్టు ద్వారా 1,100 పైగా రైతు కుటుంబాలకు దాదాపు మూడు దశాబ్దాల పాటు స్థిరమైన కౌలు ఆదాయాన్ని అందిస్తుంది. ఈ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్‌పైనా, మా పరిపాలనపైనా విశ్వాసానికి ప్రతీక.

**టాటా గ్రూప్ తో మాకు ప్రత్యేకమైన అనుబంధం**

టాటా గ్రూప్‌తో మాకు దశాబ్దాల తరబడి అనుబంధం ఉంది. 1990లో నా తండ్రి చంద్రబాబు నాయుడు గారు హైదరాబాద్‌లో 'హైటెక్ సిటీ'ని నిర్మిస్తున్నప్పుడు, ఆయన దార్శనికతను నమ్మిన మొట్టమొదటి సంస్థలలో టిసిఎస్ ఒకటి. ఆ నమ్మకంతో కూడిన అనుబంధం నేటికీ కొనసాగుతోంది. 2024లో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, నేను టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్‌ను కలిసి ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించడానికి ఆంధ్రప్రదేశ్ భిన్నంగా ఏమి చేయాలి అని అడిగాను. "వేగంపై దృష్టి పెట్టండి. పెట్టుబడిదారులకు ప్రోత్సాహకాల కంటే జాప్యం వల్ల కలిగే నష్టమే ఎక్కువ," అని ఆయన చెప్పారు.

# సర్వసభ... సమన్వయానికి వేదికా?

**శాఖల హాజరు నమోదుకే పరిమితమా..? -శాఖల పరిచయాలతోనే ముగిసిన తొలి మండల సర్వసభ**

**సర్పంచుల సందేహాలకు పూర్తి సమాధానాలు కరువు -గ్రామాభివృద్ధిపై స్పష్టమైన కార్యాచరణ కనిపించలేదు**

**వర్ధన్నపేట/జూలై 30 (జర్నలిస్ట్ వార్త):** గ్రామాభివృద్ధికి అధికారులు, సర్పంచులు కలిసి సమస్యలను చర్చించి పరిష్కార మార్గాలు రూపొందించాల్సిన మండల సర్వసభ సమావేశం ఆశించిన స్థాయిలో జరగలేదనే అభిప్రాయం వ్యక్తమైంది. కొత్తగా ఎన్నికైన సర్పంచులకు ప్రభుత్వ శాఖల పనితీరు, పథకాలు, నిధుల వినియోగం, అధికారులతో సమన్వయంపై స్పష్టమైన అవగాహన కల్పించాల్సిన సమావేశం చివరకు శాఖల సంక్షిప్త ప్రసంగాలకే పరిమితమైందని పలువురు అభిప్రాయపడ్డారు.

ఎంపీడీవో వెంకటరమణ ఆధ్వర్యంలో. గురువారం నిర్వహించిన ఈ సమావేశానికి స్పెషల్ ఆఫీసర్ శ్రీపతి అధ్యక్షత వహించారు. సమావేశానికి వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరకుడు వెంకటయ్య, పీఏసీసీఎస్ చైర్మన్ రాజేష్ కన్నాతో పాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

సమావేశంలో ఎంపీవో జుమ్మిళ్ల నాయక్ గ్రామపంచాయతీల పరిపాలన, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లలిత పోషకాహార, సంక్షేమ కార్యక్రమాలు, వ్యవసాయ అధికారి విజయ్ రైతులకు అందుబాటులో ఉన్న పథకాలు, ఏపీఓ నాగేష్ ఉపాధి హామీ పథకం, ఎంఈఓ శ్రీధర్ విద్యాశాఖ కార్యక్రమాలపై కొంత మేర వివరించారు. మిగిలిన శాఖల అధికారులు తమ శాఖల వివరాలను కేవలం ఒకటి, రెండు నిమిషాల్లో ముగించడంతో గ్రామాలకు ఉపయోగపడే పథకాలు, నిధులు, సమస్యల పరిష్కార విధానంపై పూర్తి స్థాయి అవగాహన




కల్పించలేకపోయారనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. సమావేశంలో సర్పంచులు ప్రశ్నలు అడగడానికి ప్రయత్నించినా మైక్ అందుబాటులో లేకపోవడం, అడిగిన ప్రశ్నలకు పూర్తి సమాధానాలు ఇవ్వకుండానే తదుపరి శాఖకు అవకాశం ఇవ్వడం వల్ల అనేక సందేహాలు అలాగే మిగిలిపోయాయి. దీంతో కొత్తగా ఎన్నికైన సర్పంచులు ఆశించిన స్థాయిలో శాఖల పనితీరుపై అవగాహన పొందలేకపోయారని పలువురు పేర్కొన్నారు. సర్వసభ సమావేశానికి వచ్చినట్లు లేదు కేవలం చాయి సమోసా తిని వెళ్ళడానికి వచ్చినట్లు ఉందని సభకు హాజరైన వివిధ శాఖల అధికారులు చర్చించుకుంటూ సభ నుంచి వెళ్లిపోయారు.

**సమన్వయం చేయాల్సిన స్పెషల్ ఆఫీసర్... నిర్వహణకే పరిమితమా..?**

మండల సర్వసభలో స్పెషల్ ఆఫీసర్ పాత్ర కేవలం సమావేశాన్ని నిర్వహించడం మాత్రమే కాదు. ప్రతి శాఖాధికారి గ్రామాలకు ఉపయోగపడే అంశాలను సమగ్రంగా వివరించేలా చూడడం, సర్పంచులు అడిగిన ప్రశ్నలకు అక్కడికక్కడే సమాధానాలు వచ్చేలా సమన్వయం చేయడం, అవసరమైతే శాఖల మధ్య చర్చ జరిపి సమస్యలకు పరిష్కార మార్గాలు సూచించడం కూడా బాధ్యతల్లో భాగమే.

ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ ప్రధానంగా శాఖల అధికారులను వరుసగా మాట్లాడించడానికే పరిమితమైనట్లు సమావేశానికి హాజరైన పలువురు అభిప్రాయపడ్డారు. సర్పంచుల ప్రశ్నలకు పూర్తి సమాధానాలు వచ్చేలా చర్చను ముందుకు నడిపించడంలో ఆశించిన స్థాయిలో సమన్వయం కనిపించలేదని పేర్కొన్నారు. ఫలితంగా గ్రామాల సమస్యలపై స్పష్టమైన నిర్ణయాలు, కార్యాచరణ, బాధ్యతల కేటాయింపు వంటి అంశాలు చర్చకు రాకుండానే సమావేశం ముగిసిందనే అభిప్రాయం వ్యక్తమైంది.

మొత్తంగా, గ్రామాభివృద్ధికి మార్గదర్శకంగా నిలవాల్సిన తొలి మండల సర్వసభ శాఖల పరిచయాలు, సంక్షిప్త ప్రసంగాలు, లాంఛనప్రాయ నిర్వహణకే పరిమితమైందనే భావన వ్యక్తమవుతోంది. రానున్న సమావేశాల్లో ప్రతి శాఖకు తగిన సమయం కేటాయించి, సర్పంచుల ప్రశ్నలకు సమగ్ర సమాధానాలు ఇస్తూ, సమస్యల పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందిస్తేనే సర్వసభల అసలు లక్ష్యం నెరవేరుతుందని పలువురు ప్రజాప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు.

# రాజ్యసభలోనూ బిల్లు ఆమోదం

**మొదటిపేజీ తరువాయి**

కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ మంత్రి జితేంద్ర సింగ్ ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. చర్చ సందర్భంగా ప్రభుత్వం, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడివేడీ వాదనలు జరిగాయి. పేపర్ లీక్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడానికే ఈ సవరణలు తీసుకొచ్చామని ప్రభుత్వం స్పష్టం చేసింది. భారీ జరిమానాలు, ప్రత్యేక కోర్టులు, వేగవంతమైన విచారణలతో అక్రమాలకు అడ్డుకట్ట వేస్తామని తెలిపింది.ఈ సవరణల ప్రకారం పేపర్ లీక్‌లకు పాల్పడిన వారిపై గరిష్ఠంగా రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. జైలు శిక్షతో పాటు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో విచారణ పూర్తి చేసే నిబంధనలను కూడా చేర్చారు. పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడే ముఠాలపై మరింత కఠినంగా వ్యవహరించేందుకు ఈ మార్పులు ఉపయోగపడతాయని ప్రభుత్వం పేర్కొంది.2024లో తీసుకొచ్చిన చట్టం అమలులో వచ్చిన అనుభవాల ఆధారంగానే ఈ సవరణలు రూపొందించినట్లు జితేంద్ర సింగ్ తెలిపారు. ఆ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత 52 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని చెప్పారు. పేపర్ లీక్‌ల కారణంగా ఆత్మహత్యల సంఖ్య కూడా తగ్గిందని సభకు వివరించారు.అయితే ప్రతిపక్షం మాత్రం బిల్లుపై విమర్శలు గుప్పించింది. కేవలం శిక్షలు పెంచడం సరిపోదని, పరీక్షల నిర్వహణ వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు అవసరమని డిమాండ్ చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పనితీరుపైనా ప్రశ్నలు లేవనెత్తింది. మరోవైపు విద్యార్థుల ప్రయోజనాల కోసం కేంద్రం వేగంగా చర్యలు తీసుకుందని అధికార పక్షం పేర్కొంది. మాజీ విద్యాశాఖ మంత్రి రాజీనామా, నందన్ నీలేకని నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు, నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించడం వంటి చర్యలను ప్రస్తావించింది.

# బీజేపీలో చేరకపోతే.. అంతు చూస్తామన్నారు

**మొదటిపేజీ తరువాయి**

మీడియాతో మాట్లాడారు. "సీజేపీ ఆధ్వర్యంలో దేశవ్యాప్త ఉద్యమం నిర్వహించిన సమయంలో.. బీజేపీలో చేరాలంటూ నాపై నిరంతరం ఒత్తిళ్లు వచ్చాయి. లేదంటే నాతోపాటు, నా కుటుంబం అంతు చూస్తామని బెదిరించారు"అని దీప్కే బయటపెట్టారు. దేశంలో అత్యున్నత స్థాయిలో ఉన్న వారు తనలాంటి ఓ విద్యార్థిని అలా బెదిరించడం సిగ్గుచేటన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపైనా విమర్శలు కురిపించారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేస్తుండడాన్ని ఏద్దేవా చేశారు. "ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్రభావశీలిగా (ఇన్‌ఫ్లూయెన్సర్) బాగా రాణిస్తున్నారు. ఆయన ప్రధాని కుర్చీని ఖాళీ చేసి, పూర్తిస్థాయి సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా మారిపోవాలి. దేశాన్ని పాలించే అధికారం మరో నాయకుడికి అప్పగించాలి"అని దీప్కే సూచించారు. ఇక, ఆందోళనను విరమించిన తర్వాత కూడా విద్యార్థులకు వేధింపులు కొనసాగుతున్నాయంటూ దీప్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనల్లో పాల్గొన్న వారిని రాష్ట్ర ప్రభుత్వాలు వేధిస్తున్నాయని.. ఈ చర్యలను ఆపకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. "విద్యార్థులు ఉగ్రవాదులు కారు. వారు మన దేశ భవిష్యత్. దేశ భవిష్యత్ ఇబ్బందుల్లో పడితే చూస్తూ ఊరుకోం. ప్రభుత్వాన్నే మార్చేస్తాం. వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతాం"అని అన్నారు. విద్యార్థులపై లాఠీచార్జ్, పెల్లెట్ గన్లను వాడడం వెనుక అమిత్‌షా ప్రమేయం ఉందని దీప్కే ఆరోపించారు. ఢిల్లీ పోలీసులు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కిందే పనిచేస్తారని, విద్యార్థులపై దాడులకు ఆదేశాలిచ్చిన అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తీవ్రవాదులపై ఉపయోగించే ఆయుధాలు, ఏకే47లను విద్యార్థులపై ప్రయోగించారని, ఈ దాడిలో పలువురు విద్యార్థులు కంటిచూపు కూడా కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర విద్యా మంత్రి పదవిని ప్రహ్లాద్ జోషికి అప్పగించడంపైనా స్పందించారు. రేపిస్టులను ఆహ్వానించే వ్యక్తిని విద్యామంత్రిగా నియమిస్తున్నారంటూ.. బీజేపీ ప్రభుత్వం ఎప్పుడూ రేపిస్టులు, నేరగాళ్లకు మద్దతుగా నిలుస్తోందని తీవ్రమైన విమర్శ చేశారు. బీజేపీ ఎంపీ, బాలీవుడ్ నటి కంగన రనౌత్ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ఆమెను తానొక సీరియస్ రాజకీయ నేతగా చూడడం లేదన్నారు. 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లు, 2026' పేపర్‌లీక్‌కు కారకులైన నిందితులను శిక్షించడానికే పరిమితమైంది తప్పించి, అసలు పేపర్‌లీక్‌ను నివారించడంపై దృష్టి పెట్టలేదని సీజేపీ అధికార ప్రతినిధి అశుతోష్ రంకా విమర్శించారు. తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే, మళ్లీ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# ఉపాధ్యాయులదే భావితరం బాధ్యత

**మొదటిపేజీ తరువాయి**

సరిదిద్దామని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్ కోసం పూర్తిగా అంకితం కావాలని ఆకాంక్షించారు. ఫిన్‌లాండ్, జర్మనీ దేశాల్లో ఇటీవల పర్యటించి వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో గురువారం హైదరాబాద్ లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఆయన ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రిగా తనను వైదొలగాలని కొందరు కోరుతున్నారనీ, అయితే దానికిగల కారణాలు కూడా వారే చెప్పాలన్నారు. "విద్యార్థులకు నర్సరీ నుంచి ఇంటర్ వరకు బ్రేక్ ఫాస్ట్, లంచ్ ఇస్తున్నందుకా?, టీచర్ల నియామకాలు, పదోన్నతులు నిర్వహించినందుకా?, ఐటీఐలను ఏటీసీలుగా మార్చి, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినందుకా?.. ఎందుకు నేను రాజీనామా చేయాలో చెప్పాలి" అని అడిగారు. తాను విద్యాశాఖను జిజ్ఞాసతో దగ్గర పెట్టుకున్నానని చెప్పారు. ఎల్‌కేజీ పిల్లలకు ఓట్లు ఉండవని చమత్కరించారు. గత ప్రభుత్వంలో మాదిరిగా రెవెన్యూ, ఆర్థిక, సాగునీరు వంటి కీలక శాఖలు తన వద్ద లేవని అన్నారు. భవిష్యత్ తరాన్ని ఉత్తమంగా, ఉన్నతంగా తీర్చిదిద్దడమే ఆ శాఖ మంత్రిగా తన బాధ్యత అని స్పష్టంచేశారు.

**డిసెంబర్‌లోగా విద్యాభివృద్ధి నివేదిక ఇవ్వండి**

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ఇంకా ఏం చేయాలో సూచించాలని ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా కోరారు. వచ్చే విద్యా సంవత్సరానికి ఏం చేస్తే బాగుంటుందో డిసెంబరులోగా నివేదిక రూపొందించి సమర్పించాలని ఆదేశించారు. ప్రతి మండలాన్ని ఒక క్లస్టర్ గా ఏర్పాటు చేసి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. సమాజంలో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు విద్య పునాదిగా పని చేస్తుందన్న తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వ్యాఖ్యలను సీఎం గుర్తు చేశారు. అందుకే విద్య రంగానికి, కరువును పారదోలేందుకు సాగునీటిపారుదలకు నెహ్రూ ప్రాధాన్యతనిచ్చారని తెలిపారు. ఆయన దూరదృష్టితోనే నేడు తెలంగాణ 2 కోట్లా 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని ఉత్పత్తి చేయగలిగిందని తెలిపారు. హరిత విప్లవం, పంచవర్ష ప్రణాళికలు తెచ్చిన నాయకులు ఎవరో ప్రజలకు తెలుసునని వ్యాఖ్యానించారు.

**నాటి గురుకులాలే నేటి 'నవోదయాలు'**

మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు ఏర్పాటు చేసిన గురుకులాలే నేటి నవోదయ విద్యాలయాలకు స్ఫూర్తి అని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆనాటి నాయకులు తెచ్చిన సంస్కరణలతో విద్య అందిందనీ, ఆకలి తీరిందని వివరించారు. కానీ నేటి ప్రపంచంతో పోటీ పడాలంటే అది సరిపోదని తెలిపారు. ప్రతీ పేదవాడిని ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దాలనీ, నాణ్యమైన విద్య, పౌష్టిక ఆహారం అందిచడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఆ దిశగా తెలంగాణను తీర్చి దిద్దే ప్రతినిధులు ఉపాధ్యాయులేనని అన్నారు. వెనకబాటుతనానికి ఆస్తులు, అంతస్తులతో సంబంధం లేదనీ, విద్య లేకపోవడమే అసలైన వెనకబాటుతనమని ముఖ్యమంత్రి తెలిపారు.

**విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి**

ఒక్కో విద్యార్థిపై రాష్ట్ర ప్రభుత్వం రూ.1.8 లక్షలు ఖర్చు చేస్తున్నా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రయివేటు స్కూళ్లకే ఎందుకు పంపుతున్నారో ఆలోచించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. తల్లిదండ్రులు ఒక్కో పిల్లవాడిపై ఏడాదికి సుమారు రూ.50 వేలు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. అయితే తమ ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా ఈ యేడాది సర్కారు బడుల్లో లక్ష మంది విద్యార్థులు అదనంగా చేరారని చెప్పారు. విద్యతోపాటు నైపుణ్యాలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఇంగ్లీష్ ఒక్కటే ముఖ్యమనుకుంటే చైనా ప్రపంచాన్ని ఎలా శాసిస్తోంది? అని సీఎం ప్రశ్నించారు.

# తెలంగాణ జలాశయాలకు పోటెత్తుతున్న వరద.

**మొదటిపేజీ తరువాయి**

వివిధ జలాశయాల ప్రస్తుత పరిస్థితి వివరాలు:

జూరాల ప్రాజెక్టు (మహబూబ్‌నగర్):

ఇన్‌ఫ్లో: 91,000 క్యూసెక్కులు. ఔట్‌ఫ్లో: 81,695 క్యూసెక్కులు (10 గేట్లు ఎత్తివేత).

నీటిమట్టం: గరిష్ఠంగా 318.516 మీటర్లకు గాను ప్రస్తుతం 317.35 మీటర్లకు చేరింది.

నీటి నిల్వ: పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.371 టీఎంసీలు నమోదైంది. ఎగువ, దిగువ విద్యుత్ కేంద్రాల్లోని 11 యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి:

ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం నీటిమట్టం 27.4 అడుగులకు చేరడంతో తీరప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ (నిజామాబాద్):ఇన్‌ఫ్లో: 6,250 క్యూసెక్కులు.నీటిమట్టం: పూర్తిస్థాయి 1091 అడుగులకు గాను ప్రస్తుతం 1065 అడుగులు ఉనంది. 80 టీఎంసీల సామర్థ్యానికి గాను 16 టీఎంసీల నిల్వ ఉంది.నిజాంసాగర్ ప్రాజెక్ట్ (నిజామాబాద్):ఇన్‌ఫ్లో: 3,935 క్యూసెక్కులు.నీటిమట్టం: పూర్తిస్థాయి 1405 అడుగులకు గాను ప్రస్తుతం 1395.83 అడుగులకు చేరింది. 17.802 టీఎంసీల సామర్థ్యానికి గాను 7.146 టీఎంసీల నీరు నిల్వ ఉంది (గత ఏడాది ఇదే సమయానికి 4.622 టీఎంసీలుగా ఉంది).సింగూరు ప్రాజెక్టు (సంగారెడ్డి):

ఇన్‌ఫ్లో: 517 క్యూసెక్కులు. ఔట్‌ఫ్లో: 470 క్యూసెక్కులు.

నీటి నిల్వ: 29.9 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను ప్రస్తుతం 4.249 టీఎంసీల నీటి నిల్వ నమోదైంది

# వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు

**మొదటిపేజీ తరువాయి**

అన్ని శాఖలతో సమన్వయం చేసుకొని నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురువారం రెవెన్యూ, విపత్తు నిర్వహణ (డిజాస్టర్ మేనేజ్‌మెంట్) అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో గడచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, రాబోయే రెండు రోజుల్లో కురిసే వర్షాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. వాగులు, వంకలు, చెరువులు, జలాశయాల వద్ద ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలి. ప్రమాదకర ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తూ, అవసరమైతే వెంటనే సురక్షిత ప్రాంతాలు లేదా పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి. ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే తక్షణమే స్పందించి సహాయక చర్యలు అందించాలని సూచించారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రవాణా, విద్యుత్, తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలి. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా(హైడ్రా, జిహెచ్ ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సాధారణ జీవనానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నాలుగు రోజుల క్రితం వరకు రాష్ట్రంలో 30శాతం మేర ఉన్న వర్షపాతం లోటు, గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో భర్తీ అయి దాదాపు సాధారణ స్థాయికి చేరుకుందని మంత్రి తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వివిధ జిల్లాలకు అలర్ట్‌లు జారీ అయ్యాయని మంత్రి తెలిపారు. ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశామని అలాగే నిజామాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామని తెలిపారు. వచ్చే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే జిల్లాలపై ప్రధానంగా దృష్టి సారించాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తుగానే చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

# బస్ టికెట్‌తో పాటే ఆటో బుకింగ్..

**మొదటిపేజీ తరువాయి**

ఈ చర్చలు కొలిక్కి వచ్చిన వెంటనే ఈ-ఆటోలు రోడ్డెక్కనున్నాయి.

ఈ కొత్త విధానంలో ప్రయాణికులు తమ బస్ టికెట్‌ను బుక్ చేసుకునే సమయంలోనే అదనంగా ఆటో రైడ్‌ను కూడా ఒకేసారి బుక్ చేసుకునేలా ప్రత్యేక సౌకర్యం కల్పించనున్నారు. దీని ద్వారా ప్రయాణికులను వారి నివాసం నుంచి సమీప బస్ పాయింట్‌కు, అలాగే బస్సు దిగిన తర్వాత అక్కడి నుంచి వారి చివరి గమ్యస్థానానికి ఈ-ఆటోలు సురక్షితంగా చేరవేస్తాయి. ఫలితంగా ప్రయాణికులకు విలువైన సమయం ఆదా అవడంతో పాటు బస్టాప్‌లకు చేరుకోవడానికి, అక్కడి నుంచి గమ్యస్థానాలకు వెళ్లడానికి పడే ప్రయాసలు తప్పుతాయి.ఈ ఎలక్ట్రిక్ ఆటో సేవలను ప్రయోగాత్మకంగా తొలుత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. ఇక్కడ లభించే స్పందన, ఫలితాల ఆధారంగా రెండో దశలో వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ వంటి రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాలకు దశలవారీగా విస్తరించాలని యోచిస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం నగరంలో అధిక ఛార్జీలతో నడుస్తున్న ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి ప్రైవేట్ రైడ్ హెయిలింగ్ యాప్‌ల కన్నా గణనీయంగా తక్కువ ఛార్జీలతో ఈ సేవలను అందించేందుకు ఆర్టీసీ ప్రణాళికలు రూపొందిస్తోంది.ఈ నిర్ణయం వల్ల హైదరాబాద్ శివారు ప్రాంతాలైన ఎల్బీనగర్, ఉప్పల్, మియాపూర్, పటాన్‌చెరు, శంషాబాద్, ఘట్‌కేసర్ వంటి కనెక్టివిటీ సమస్యలున్న ప్రాంతాల ప్రజలకు గొప్ప ఊరట లభించనుంది. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆర్టీసీ ఈ-ఆటోల నిర్ణయం ఒక మైలురాయిగా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## వర్ధన్నపేట ఎస్సైని కలిసిన తెలంగాణ ఆటో యూనియన్ నూతన కమిటీ




**వర్ధన్నపేట/జూలై 30(జర్నలిస్ట్ వార్త);**తెలంగాణ ఆటో యూనియన్ వర్ధన్నపేటవరంగల్ నూతన పాలకవర్గ సభ్యులు గురువారం వర్ధన్నపేట ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కమిటీ సభ్యులను ఎస్సైకి పరిచయం చేసి, ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్సై నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేసి, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కన్నం కుమార్, అధ్యక్షుడు సమ్మెట రమేష్, ఉపాధ్యక్షుడు బానోతు సంపత్ నాయక్, కార్యదర్శి గుర్రాల విక్రమ్, కార్యవర్గ సభ్యులు గారె ప్రతాప్, మార్క యాకాంబరం, బండారి కుమారస్వామి, మాలోతు సంతోష్, బానోతు రమేష్, మీస రాజు, బండి రమేష్ పాల్గొన్నారు

# సర్వసభను బహిష్కరించడం రాజకీయమే

### బీఆర్ఎస్, బీజేపీ సర్పంచుల తీరుపై ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య విమర్శలు

**వర్ధన్నపేట, జూలై 30 (జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి శ్రీపతి అధ్యక్షతన, ఎంపీడీఓ జి. వెంకటరమణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో రాజకీయ వేడి నెలకొంది. సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరైన వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య మాట్లాడుతూ ఇది మండలంలోని తొలి సర్వసభ కావడంతో గ్రామాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు అన్వేషించాల్సిందిపోయి బీఆర్ఎస్, బీజేపీ సర్పంచులు సమావేశాన్ని బహిష్కరించడం సమంజసం కాదన్నారు. అధికారులు చెప్పే వివరాలు కూడా వినకుండా వాకౌట్ చేయడం గ్రామాల అభివృద్ధిపై వారికి ఉన్న చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేస్తోందని విమర్శించారు. రాజకీయ మనుగడ, పార్టీ నాయకుల మెప్పు కోసమే ఈ చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు.




ఇల్లంద గ్రామంలో ఇళ్ల కూల్చివేత అంశాన్ని ప్రస్తావిస్తూ, గ్రామసభ లేదా వార్డు సభ్యుల తీర్మానం, బాధితులకు నోటీసులు వంటి నిబంధనలు పాటించకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిపై మాట్లాడుతున్న ప్రతిపక్ష నాయకులు, అప్పట్లో చేసిన పనులపై స్పష్టమైన సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు చేపడుతున్న అభివృద్ధి పనులను ఓర్వలేకే కొందరు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ కొడగని రాజేష్ కన్నాతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రతిపక్ష గ్రామాలకు నిధులు ఎక్కడ?

### ప్రతిపక్ష గ్రామాలపై వివక్ష ఆరోపణలతో బీఆర్ఎస్, బీజేపీ సర్పంచుల బహిష్కరణ..

### ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయింపు



**వర్ధన్నపేట/జూలై 30 (జర్నలిస్ట్ వార్త):** వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండల సర్వసభ సమావేశం రాజకీయ వేడిని రాజేసింది. ఈజీఎస్ నిధులు, అభివృద్ధి పథకాల కేటాయింపులో అధికార పార్టీకి చెందిన గ్రామాలకు ప్రాధాన్యం కల్పిస్తూ, ప్రతిపక్ష పార్టీల సర్పంచుల గ్రామాలపై వివక్ష చూపుతున్నారని ఆరోపిస్తూ బీఆర్ఎస్, బీజేపీ సర్పంచులు సమావేశాన్ని మధ్యలోనే బహిష్కరించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. గ్రామాల అభివృద్ధికి రాజకీయ రంగు పులమడం సరికాదని, ప్రజల ఓట్లతో ఎన్నికైన ప్రతి సర్పంచ్‌కు సమాన గౌరవం, ప్రతి గ్రామానికి సమాన నిధులు అందేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈజీఎస్ నిధుల కేటాయింపుతో పాటు ఇతర అభివృద్ధి పనుల్లోనూ పక్షపాత ధోరణి కొనసాగుతోందని ఆరోపించారు.అధికార యంత్రాంగం రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా పనిచేయాలని, ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు తన వైఖరిని మార్చుకుని అన్ని గ్రామాలను సమదృష్టితో చూడాలని సర్పంచులు డిమాండ్ చేశారు. వివక్ష కొనసాగితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సర్వసభలో అభివృద్ధి అంశాలపై చర్చ జరగాల్సిన సమయంలో నిరసనకు దిగడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

## ప్రభుత్వ పాఠశాలకు గ్రామ దాతల అండ

### 218 మంది విద్యార్థులకు రూ.20 వేల విలువైన ఉచిత డైరీల పంపిణీ



**వేలేరు/జూలై 30 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి గ్రామ దాతలు అండగా నిలుస్తున్నారు. వేలేరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం గ్రామానికి చెందిన జి. రాజేష్, జి. రాజు, బి. రమేష్, జి. బ్రహ్మం, ఈ. వీరన్న 218 మంది విద్యార్థులకు సుమారు రూ.20 వేల విలువైన పాఠశాల డైరీలను ఉచితంగా పంపిణీ చేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ, ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవసరమైన డైరీలను అందజేస్తూ విద్యాభివృద్ధికి తోడ్పడుతున్న దాతలను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలకు అండగా నిలిచే దాతల సేవలు ఆదర్శనీయమని కొనియాడారు.విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. చదువులో, క్రీడల్లో ప్రతిభ చూపే విద్యార్థులకు గ్రామపంచాయతీ తరఫున ప్రోత్సాహకాలు అందజేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యం, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేసిన ఎంపిడివో.



**బయ్యారం,/జులై 30,(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలంలోని నామాలపాడు ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలను మండల ఎంపీడీవో దీపిక ఆకస్మికంగా గురువారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలోని పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు తయారుచేస్తున్న వంటకాలను పరిశీలించారు.వంటకాలపై వార్డెన్ ను అడిగి తెలుసుకున్నారు.మెనూ ప్రకారం ఆహారం అందిచడం,మౌళిక వసతులు తదితర విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని అధ్యాపకులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏకలవ్య ప్రిన్సిపల్ ధనరాజ్,అధ్యాపక బృందం,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం.




**బయ్యారం/,జులై 30.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1976-77 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని హైదరాబాద్ లోని క్రితుంగ రెస్టారెంట్ లో గురువారం ఘనంగా నిర్వహించారు.దాదాపు 50 ఏళ్ల తర్వాత వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన విద్యార్థులు ఒకేచోట చేరి పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు.గురువారం బొందలపాటి రవి కుమార్ జన్మదినం సందర్భంగా రవి కుమార్ ను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో కొల్లా మన్మధరావు,వై.నాగేశ్వరావు,ఎండి వసీమ్,మట్టి వెంకటేశ్వర్లు,ఆర్ వీరభద్రం,ఎండి యుసాఫ్,ఎలమర్తి వెంకటేశ్వర్లు,బుక్క సత్యం,మొగిలిచర్ల వెంకటేశ్వర్లు,జి.వీరభద్రం,వివి నాయుడు,బొందలపాటి రవి కుమార్, ఎన్.ప్రసాద్,ఎస్.వెంకటేశ్వరరావు, కాజా రమణ,టీ.లీలా,ఎం.పద్మప్రియ,పద్మజ,వాసిరెడ్డి సులోచన,రామకృష్ణ రెడ్డి, పుట్టకుంట సత్యం, పావని నున్నా, వేములపల్లి స్వరూప,పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.ం

## భూ రీసర్వేను తనిఖీ చేసిన రెవెన్యూ అదనపు కలెక్టర్.





**బయ్యారం,/జులై 30(జర్నలిస్ట్ వార్త)**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ రీసర్వే మండలంలో గంధంపల్లి రెవిన్యూ గ్రామంలో భూ రీ సర్వే పనుల జరుగుతున్న తీరును మహబూబాబాద్ జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్ ఆకస్మికంగా గురువారం తనిఖీ చేసి,తనిఖీ వివరాలను ల్యాండ్ సర్వే అధికారులు అడిగి తెలుసుకున్నారు. గ్రామ సరిహద్దు,రెవిన్యూ సరిహద్దులు, ప్రభుత్వ భూములు,ఆబాధి,గ్రామ కంఠం,రోడ్లు,ప్రభుత్వ భవనాలు,ఇండ్లు భూ సర్వేలో స్పష్టంగా నమోదు చేయాలని,తప్పులు దొర్లకుండా సర్వే పారదర్శకంగా నిర్వహించాలని అధనపు కలెక్టర్ ల్యాండ్ రీ సర్వే అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మండల తాహశీల్దార్ సప్పిడి నాగరాజు,జిల్లా సర్వే ఏడి అధికారి శ్రీనివాసులు,బయ్యారం సర్వేయర్ శివయ్య,గంధం పల్లి జిపిఓ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గుంతల కంటే బురదే పెద్ద సమస్య..!

### మట్టి పోయడంతో మరింత దారుణమైన 5వ వార్డు రహదారి - నీటి పారుదల లేక కాలనీవాసుల అవస్థలు

**వర్ధన్నపేట/ జూలై 30 (జర్నలిస్ట్ వార్త):**
సమస్యను పరిష్కరించాల్సిన చర్యే కొత్త సమస్యకు దారితీసిన ఘటన వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో చోటుచేసుకుంది. 5వ వార్డులో సిమెంట్ రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు మట్టిని పోయడం వరకు బాగానే ఉన్నా, వర్షపు నీరు వెళ్లే కాల్వలను శుభ్రం చేయకపోవడంతో ఆ మట్టంతా బురదగా మారి రహదారి అధ్వానంగా తయారైంది.
ప్రస్తుతం రోడ్డంతా నీరు, బురదతో నిండిపోవడంతో ప్రతి అడుగు ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు జారిపడే పరిస్థితి ఉండగా, పాదచారులు బురదలో నడవాల్సి వస్తోందని వాపోతున్నారు. చిన్నారులు, వృద్ధులు



బయటకు రావడానికే భయపడుతున్నారని చెబుతున్నారు.స్థానికుల అభిప్రాయం ప్రకారం, రోడ్డుపై మట్టి వేయడం కాకుండా ముందుగా నీటి పారుదల వ్యవస్థను సరిచేయాల్సి ఉంది. కాల్వలు పూడిపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లక రహదారిపైనే నిల్వ ఉంటోందని, దీంతో గుంతలు మరింత పెద్దవిగా మారే ప్రమాదం ఉందని అంటున్నారు.మట్టి పోశారు.చేతులు దులుపుకున్నారు.కానీ సమస్య మాత్రం అలాగే ఉంది అని కాలనీవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలిక చర్యలతో కాకుండా కాల్వల మరమ్మతులు, రహదారి పునరుద్ధరణ చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని 5వ వార్డు సభ్యులతో పాటు స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

## రీ సర్వేకు సహకరించండి.. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

### ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు.. రైతుల ప్రయోజనాల కోసమే ప్రభుత్వం చర్యలు- తహసీల్దార్ బావ్ సింగ్





**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరోజూలై 30 (జర్నలిస్ట్ వార్త):** రైతుల భూములకు శాశ్వత రక్షణ కల్పించి, భూ వివాదాలకు పూర్తిస్థాయిలో తెరదించేందుకు ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ రీ సర్వే కార్యక్రమానికి రైతులు పూర్తి సహకారం అందించాలని ధర్మసాగర్ తహసీల్దార్ బావ్ సింగ్ పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం క్యాతంపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన భూముల రీ సర్వే అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నిజాం కాలంలో నిర్వహించిన సర్వే ఆధారంగానే ఇప్పటివరకు భూముల రికార్డులు కొనసాగుతున్నాయని, కాలక్రమేణా హద్దుల మార్పులు, వారసత్వ విభజనలు, ఆక్రమణలు వంటి కారణాలతో అనేక చోట్ల భూ వివాదాలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ రీ సర్వే చేపట్టిందన్నారు.రీ సర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూమికి ఖచ్చితమైన హద్దులు భూదార్ నంబర్ నమోదు అవుతుందని, భవిష్యత్తులో భూముల కొనుగోలుఅమ్మకాలు, వారసత్వ మార్పులు, రుణాల మంజూరు వంటి అంశాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని వివరించారు. సర్వే సమయంలో రైతులు తప్పనిసరిగా తమ భూముల వద్ద హాజరై, అవసరమైన పత్రాలు చూపించి సర్వేయర్లకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గం ఆర్ఐ అశోక్ రెడ్డి, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

అక్షరం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక



# ప్రజాదర్బార్‌తో సమస్యలకు పరిష్కారం

**భూ రీ-సర్వేతో ఏడాదిన్నరలో రెవెన్యూ వివాదాలకు ముగింపు**

**సత్తుపల్లి క్లస్టర్‌లో 3,500 వినతులు.. 1,800 ఇందిరమ్మ ఇళ్ల కోసమే**




**కల్లూరు/జూలై 30 (జర్నలిస్ట్ వార్త):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచారపౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కల్లూరులో గురువారం నిర్వహించిన సత్తుపల్లి క్లస్టర్ ప్రజాదర్బార్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలిసి పాల్గొన్న ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

సత్తుపల్లి క్లస్టర్ ప్రజాదర్బార్‌లో సుమారు 3,500 దరఖాస్తులు అందాయని, వాటిలో 1,800 ఇందిరమ్మ ఇళ్లకు, 500 రెవెన్యూ సమస్యలకు, 200 పెన్షన్లకు సంబంధించినవేనని మంత్రి తెలిపారు. అర్హులందరికీ ఒకేసారి ఇళ్లు మంజూరు చేయడం ఆర్థికంగా సాధ్యం కాకపోవడంతో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ సమస్యలకు డిజిటల్ రీ-సర్వే ద్వారా శాశ్వత పరిష్కారం చూపనున్నామని మంత్రి స్పష్టం చేశారు. సత్తుపల్లి, కల్లూరు ప్రాంతాల్లో రీ-సర్వే పనులు వేగంగా సాగుతున్నాయని, మరో ఏడాదిన్నరలో రాష్ట్రవ్యాప్తంగా రీ-సర్వే పూర్తి చేసి రెవెన్యూ వివాదాలకు ముగింపు పలుకుతామని తెలిపారు. ధరణిలో జరిగిన అక్రమాలపై విచారణ కొనసాగుతోందని, పేదల భూములను అక్రమంగా బదిలీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఎలాంటి రాజీ పడబోదని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ప్రజాదర్బార్‌లో వచ్చిన ప్రతి దరఖాస్తును ప్రత్యేక బృందాల ద్వారా పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే 2 వేల ఎకరాల్లో భూ సర్వే పూర్తి చేసినట్లు వెల్లడించారు. దరఖాస్తుల్లో ఆధార్, ఫోన్ నంబర్ వంటి పూర్తి వివరాలు నమోదు చేస్తే సమస్యల పరిష్కారం వేగవంతమవుతుందని సూచించారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అధికారులే గ్రామాలకు వచ్చి సమస్యలు



పరిష్కరించడం ప్రజాదర్బార్ ప్రత్యేకత అని అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గానికి అదనంగా వెయ్యి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్‌రెడ్డి, సబ్‌కలెక్టర్ అజయ్ యాదవ్, డీఎఫ్‌వో అనూజ్ అగర్వాల్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అధికారులను నిలదీసిన ఇల్లంద సర్పంచ్

**సహకారం అందడం లేదంటూ సర్వసభను బహిష్కరణ**




**వర్ధన్నపేట/జూలై 30 (జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఇల్లంద గ్రామ సర్పంచ్ బేతి సాంబయ్య అధికారులను నిలదీశారు. మండలంలోనే పెద్ద గ్రామమైన ఇల్లందకు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు సకాలంలో మంజూరు చేయడం లేదని, అధికారుల నుంచి తగిన సహకారం అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధి పనులు పెండింగ్‌లో పడుతున్నాయని పేర్కొంటూ సమావేశంలో తన నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం తన అభ్యంతరాలను నమోదు చేస్తూ సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించి బయటకు వెళ్లారు. ఈ ఘటన సమావేశంలో చర్చనీయాంశంగా మారింది.

# పేకాట కేసులో కానిస్టేబుల్‌కు సస్పెన్షన్

**శాఖా నియమాల ఉల్లంఘనపై కమిషనర్ చర్య**



**వేంసూర్/ జూలై 30 (జర్నలిస్ట్ వార్త):** వేంసూర్ మండలం అమ్మపాలెం గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసిన ఘటనలో పట్టుబడిన ఏఆర్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 19న కంచర్ల వెంకటేశ్వరరావు అలియాస్ జయం, శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై వేంసూర్ ఎస్సై కవిత నేతృత్వంలో పోలీసులు దాడి నిర్వహించారు. ఈ ఘటనలో 22 మందిపై కేసులు నమోదు చేశారు. నిందితుల్లో సత్తుపల్లి టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ (డ్రైవర్) మహమ్మద్ ఇమ్రాన్ షరీఫ్ కూడా ఉన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించడం, పోలీసు శాఖా నియమాలను ఉల్లంఘించినట్లు ప్రాథమిక విచారణలో తేలడంతో మహమ్మద్ ఇమ్రాన్ షరీఫ్‌ను తక్షణమే సస్పెండ్ చేస్తూ పోలీస్ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. శాఖలో క్రమశిక్షణకు భంగం కలిగించే చర్యలను ఉపేక్షించబోమనే సంకేతంగా ఈ చర్యను పోలీసులు పేర్కొంటున్నారు.

# ప్రభుత్వ భవనాలపై ప్రైవేట్ యాడ్స్‌కు చెక్

**సత్తుపల్లి సబ్‌జైలు వద్ద కమర్షియల్ బోర్డు తొలగింపు**

**-సబ్‌జైలు సూపరింటెండెంట్‌ను అభినందించిన భాస్కర్ల వీరంరాజు**







**సత్తుపల్లి/ జూలై 30 (జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి సబ్‌జైలు ప్రధాన ద్వారంపై ఏర్పాటు చేసిన ప్రైవేట్ కమర్షియల్ ప్రకటనను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే తొలగించారని బీజేపీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు, న్యాయవాది భాస్కర్ల వీరంరాజు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలపై ప్రైవేట్ సంస్థల పేర్లు, వాణిజ్య ప్రకటనలు ఉండడం నిబంధనలకు విరుద్ధమని గుర్తించి సబ్‌జైలు సూపరింటెండెంట్ కుటుంబరావుకు ఫోన్ ద్వారా సమాచారం అందించగా, ఆయన తక్షణమే స్పందించి ప్రకటనను తొలగింపజేశారని చెప్పారు. బాధ్యతాయుతంగా స్పందించిన అధికారిని ఈ సందర్భంగా అభినందించారు. ప్రభుత్వ భవనాలపై ఇలాంటి కమర్షియల్ యాడ్స్ లేకుండా పోలీస్ స్టేషన్లు, తహసీల్దార్ కార్యాలయాలు తదితర శాఖల అధికారులు కూడా చర్యలు తీసుకోవాలని వీరంరాజు కోరారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసమే ఈ అంశాన్ని ప్రస్తావించానని, దీనిని రాజకీయ కోణంలో చూస్తూ వ్యక్తిగత విమర్శలు చేయడం విచారకరమన్నారు. ప్రజాప్రయోజన అంశాలపై తన పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# శేషుకుమార్ సేవాస్ఫూర్తికి నివాళి

**వృద్ధాశ్రమంలో నిత్యావసర వస్తువుల పంపిణీ**



**సత్తుపల్లి/జూలై 30 (జర్నలిస్ట్ వార్త):** ప్రైవేట్ పాఠశాలల అభివృద్ధికి విశేష కృషి చేసి, విద్యా రంగానికి విశిష్ట సేవలు అందించిన సూరపనేని శేషుకుమార్ నాలుగో వర్ధంతి సందర్భంగా సత్తుపల్లి డివిజన్ ప్రైవేట్ పాఠశాలల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వేంసూర్‌లోని వృద్ధుల శరణాలయంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు బియ్యం, బకెట్లు, సబ్బులు, నిత్యావసర సరుకులు తదితర ఉపయోగకరమైన వస్తువులను అందజేశారు. అనంతరం శేషుకుమార్ విద్యా రంగానికి అందించిన సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సంఘ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల సంఘం జిల్లా కార్యదర్శి నాయుడు వెంకటేశ్వరరావు, సత్తుపల్లి డివిజన్ అధ్యక్షుడు పశుపులేటి నాగేశ్వరరావు, సంఘ నాయకులు చీకటి శ్రీనివాసరావు, నాగేంద్రరెడ్డి, వెదుళ్ల మురళి, శ్రీనివాసరావు, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలస్యమైనా.. ఆగని అన్నదాత

**ఊపందుకున్న వరి నాట్లు.. వర్షాలతో రైతుల్లో కొత్త ఆశలు -లేటుగా ప్రారంభమైన ఖరీఫ్ సాగు.. పొలాల్లో సందడి**

**వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్, పప్పుధాన్యాల వైపు మరికొందరు**

**హనుమకొండ బ్యూరో జూలై 30 (జర్నలిస్ట్ వార్త): ప్రత్యేక కథనం**

ఆలస్యంగా పలకరించిన వర్షాలు ఇప్పుడు రైతుల్లో కొత్త ఆశలను నింపుతున్నాయి. గత రెండు నెలలుగా ఆకాశం వైపు ఎదురుచూసిన అన్నదాత ప్రస్తుతం పొలాల్లో వరి నాట్లతో బిజీగా మారాడు. మండలంలోని గ్రామాల్లో తెల్లవారుజాము నుంచే పొలాలు రైతులు, కూలీలతో కళకళలాడుతున్నాయి. వర్షాలు కుదుటపడటంతో నాట్ల పనులు ఊపందుకున్నాయి.

జూన్, జూలైలో పూర్తి కావాల్సిన వరి సాగు ఈసారి వర్షాభావంతో వెనుకబడింది. వర్షాలు లేక నర్సరీలు సిద్ధం చేసుకున్న రైతులు కూడా నాట్లు వేయలేక ఆందోళన చెందారు. ఇటీవల కురిసిన వర్షాలతో పరిస్థితులు మారి పొలాల్లో మళ్లీ సందడి నెలకొంది. ఎన్ని ఎకరాలు సాగు చేయాలన్న దానిపై వర్షాల పరిస్థితిని అంచనా వేసుకుంటూ రైతులు నిర్ణయాలు తీసుకుంటున్నారు.

కెనాల్ ఆయకట్టు ప్రాంతాల్లో ఇప్పటికే వరి నాట్లు ఎక్కువగా పూర్తయ్యాయి. బావుల నీటిపై ఆధారపడే రైతులు పదిహేను రోజుల ముందుగానే నాట్లు పూర్తి చేసుకోగా, పూర్తిగా వర్షాధార సాగు చేసే రైతులు ఇప్పుడు నాట్లు ప్రారంభించారు. సన్నరకాలు, సాంబా మసూరి,



బాస్మతి, జై శ్రీరామ్, ఆర్‌ఎన్‌ఆర్ వంటి రకాలపై రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.

అయితే సాగు పూర్తయినా రైతుల ఆందోళనలు మాత్రం తగ్గడం లేదు. పంట చేతికొచ్చే సమయానికి హార్వెస్టర్ యంత్రాలు దొరక్క కోతల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు చెబుతున్నారు. ప్రతి ఏడాది ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని, ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**వరి వదిలి ప్రత్యామ్నాయ పంటల వైపు...**

వర్షాలపై నమ్మకం తగ్గడంతో కొందరు రైతులు వరి సాగుకు దూరమవుతున్నారు. తక్కువ నీటితో సాగయ్యే కంది, పెసర, శనగ వంటి పప్పుధాన్యాల వైపు మొగ్గు చూపుతున్నారు. సాగు ఖర్చులు పెరగడం, నీటి కొరత, వాతావరణ అనిశ్చితి కారణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకుంటున్నామని రైతులు చెబుతున్నారు.

**ఆయిల్‌పామ్‌కు ప్రభుత్వ ప్రోత్సాహం**


ప్రభుత్వం రైతు నేస్తం పథకం ద్వారా ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తోంది. సబ్సిడీపై మొక్కలు, ఎరువులు, పురుగుమందులు అందించడంతో పాటు తొలి మూడు సంవత్సరాలపాటు ఆర్థిక సహాయం అందిస్తోంది. ఐదో సంవత్సరం నుంచి దిగుబడిని ప్రభుత్వం కొనుగోలు చేసే హామీ ఉండటంతో పలువురు రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

**వర్షాలే కీలకం**

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఇలాగే కొనసాగితే మండలంలో వరి సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశముంది. అయితే మళ్లీ వర్షాలు ముఖం చాటేస్తే రైతులు తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఖరీఫ్ సీజన్ రైతులకు లాభసాటిగా మారాలంటే ప్రకృతి పూర్తిగా సహకరించాల్సిందే.

# పీఎంఈజీపీ రుణాలపై టెస్కాబ్ విచారణ

**సత్తుపల్లి డీసీసీబీ శాఖలో క్షేత్రస్థాయి పరిశీలన.. లబ్ధిదారుల నుంచి వివరాల సేకరణ**



**సత్తుపల్లి/ జూలై 30 (జర్నలిస్ట్ వార్త):** పీఎంఈజీపీ రుణాల మంజూరులో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో తెలంగాణ కో-ఆపరేటివ్ హబ్ (టెస్కాబ్) ఉన్నతాధికారుల బృందం సత్తుపల్లి డీసీసీబీ శాఖలో క్షేత్రస్థాయి విచారణ చేపట్టింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 74 మంది లబ్ధిదారులకు రూ.12.40 కోట్ల రుణాలు మంజూరు కాగా, వారిలో 12 మందికే రూ.3.40 కోట్ల సబ్సిడీ జమై, మిగిలిన 62 మందికి సబ్సిడీ అందలేదని అధికారులు గుర్తించినట్లు సమాచారం. టెస్కాబ్ డీజీఎం సంపత్‌కుమార్, ఏజీఎం మణికుమార్, ఖమ్మం జిల్లా డీసీసీబీ ఏజీఎం ప్రవీణ్‌కుమార్‌తో కూడిన బృందం లబ్ధిదారులను కలిసి రుణాల మంజూరు, సబ్సిడీ విడుదల, యూనిట్ల ఏర్పాటు తదితర అంశాలపై వివరాలు సేకరిస్తోంది. సత్తుపల్లితో పాటు పెనుబల్లి, వేంసూరు శాఖల్లో కూడా పీఎంఈజీపీ రుణాల మంజూరుపై విచారణ నిర్వహించి, నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిసింది.

# పీఎంఈజీపీ రుణాలపై విచారణ జరపాలి

**అన్ని వివరాలు బహిర్గతం చేయాలని బీజేపీ డిమాండ్**

**సత్తుపల్లి/జూలై 30 (జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి మండలంలో ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) కింద రుణాల మంజూరు, లబ్ధిదారుల ఎంపిక, సబ్సిడీ విడుదలలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు సాలి శివకృష్ణ డిమాండ్ చేశారు. 2008 నుంచి ఇప్పటివరకు పథకం కింద ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎన్ని మంజూరయ్యాయి, ఎన్ని తిరస్కరించబడ్డాయి, ఎంత మొత్తంలో రుణాలు, సబ్సిడీలు విడుదలయ్యాయనే వివరాలను ప్రజల ముందుంచాలని కోరారు. అర్హత లేని వ్యక్తులకు రుణాలు మంజూరు చేశారా? ఒకే కుటుంబానికి లేదా సంబంధిత వ్యక్తులకు పదేపదే ప్రయోజనం కల్పించారా? మధ్యవర్తుల ప్రమేయం ఉందా? వంటి అంశాలపై సమగ్ర దర్యాప్తు జరగాలని ఆయన అన్నారు. రుణాలు పొందిన యూనిట్లు వాస్తవంగా స్థాపించబడ్డాయా, ప్రస్తుతం నిర్వహణలో ఉన్నాయా, సంబంధిత శాఖలు, బ్యాంకులు భౌతిక తనిఖీలు చేపట్టాయా అనే అంశాలను కూడా పరిశీలించాలని కోరారు.



ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) ద్వారా సేకరిస్తున్నామని, రుణ దరఖాస్తులు, మంజూరు ఉత్తర్వులు, బ్యాంకు రుణాల వివరాలు, సబ్సిడీ విడుదల, యూనిట్ల తనిఖీ నివేదికలను పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకువస్తామని సాలి శివకృష్ణ తెలిపారు. ప్రభుత్వ పథకాలు నిజమైన అర్హులకు చేరేలా చూడాలని, పీఎంఈజీపీ నిధుల దుర్వినియోగం జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సత్తుపల్లి ప్రాంతంలో గత సంవత్సరాల రుణాలపై సమగ్ర ఆడిట్ నిర్వహించి, అక్రమాలు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు

జర్నలిస్ట్ వార్త
TELTEL/2023/87607
శుక్రవారం 31 జులై 2026

# రాజ్యాంగం కల్పించిన హక్కు ఓటు హక్కు నమోదును త్వరగా పూర్తి చేసుకోండి

### - సీనియర్ కాంగ్రెస్ నాయకులు వీసం సురేందర్ రెడ్డి



**హసన్ పర్తి/జులై 30 (జర్నలిస్ట్ వార్త)**
ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, అర్హులైన ప్రతి ఒక్కరూ వెంటనే ఓటరు నమోదు ప్రక్రియలో పాల్గొనాలని సీనియర్ కాంగ్రెస్ నాయకులు వీసం సురేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆగస్టు 3 తేదీతో ఎన్నికల కమిషన్ ఇచ్చిన గడుపు ముగిస్తుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ తుది దశకు చేరుకుందని తెలిపారు. ఇప్పటికీ ఎన్యూమరేషన్ ఫారం సమర్పించని వారు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటనే తమ స్థానిక బీఎల్ఓ (బూత్ లెవల్ ఆఫీసర్)ను కలిసి ఫారాన్ని అందజేయాలని కోరారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని పేర్కొంటూ, అర్హులైన వారందరూ తమ పేర్లు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఓటు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు

# ప్రీ-ప్రైమరీ పోస్టుల నియామకాల్లో అక్రమాలపై విచారణ జరిపించాలి

### : మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య





**ఖమ్మం /జులై 30 (జర్నలిస్ట్ వార్త):**
ఖమ్మం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్.ను గురువారం సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం కలిసి వినతిపత్రం సమర్పించింది. ఇటీవల జిల్లాలో నిర్వహించిన ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల నియామక ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, బాధిత అభ్యర్థులతో కలిసి వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ ఈ నియామకాలలో అర్హులైన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రక్రియలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. మొత్తం నియామక ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపి, అర్హులైన అభ్యర్థులకే ప్రాధాన్యత ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. బాధిత అభ్యర్థులకు ధైర్యం చెప్తూ.. బాధితులకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అవసరమైతే ఈ అక్రమాలపై హైకోర్టును కూడా ఆశ్రయిస్తామని సండ్ర వెంకట వీరయ్య భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల ,నగర పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, పగడాల నాగరాజు, భాషబోయిన వీరన్న, నాయకులు బిచ్చాల తిరుమలరావు, బత్తుల మురళి, తదితర నాయకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

# టీసీసీ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలి

### కల్లూరులో ముఖ్య కార్యకర్తల సమావేశంలో బిషప్ మానకొండ సుదర్శన్ పిలుపు





**కల్లూరు/జులై 30(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ క్రిస్టియన్స్ కౌన్సిల్ (టీసీసీ) 13వ వార్షికోత్సవం సందర్భంగా ఆగస్టు 22న ఖమ్మంలో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని టీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ మానకొండ సుదర్శన్ పిలుపునిచ్చారు. గురువారం కల్లూరు పట్టణంలో పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు
క్రైస్తవ హక్కుల పరిరక్షణ కోసం టీసీసీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, పాస్టర్లు, సభ్యులు సకాలంలో మహాసభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ప్రతి పాస్టర్, కార్యకర్త టీసీసీ జెండాలతో సైకిళ్లు, ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా మహాసభకు తరలిరావాలని సూచించారు. మహాసభ నిర్వహణలో ప్రతి నాయకుడు సమన్వయంతో పనిచేసి విస్తృత ప్రచారం చేపట్టాలని ఆయన కోరారు. సమావేశంలో ఏసుదాసు, ఇశ్రాయేలు, గుంటి బాబురావు, రావేలమ్మతో పాటు టీసీసీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, పాస్టర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరంగల్ జిల్లా ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడిగా నిరంజన్‌కు నియామక పత్రం





**వర్ధన్నపేట/ జూలై 30(జర్నలిస్ట్ వార్త);** వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడిగా సూరారపు నిరంజన్‌కు నియామక పత్రాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి అయూబ్, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తనకు పదవి రావడానికి సహకరించిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎద్దు సత్యం, పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూరారపు నిరంజన్ కృతజ్ఞతలు తెలిపారు.

# సాగునీటి విడుదల
# రైతులకు అండగా ప్రభుత్వం..

### అపోహలు సృష్టించొద్దని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**పర్వతగిరి/జులై 30 (జర్నలిస్ట్ వార్త):**
రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. గురువారం పర్వతగిరి జలాశయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కాలువలకు సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారులతో సమన్వయం చేసి రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. పర్వతగిరి మండలంలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రైతుల పేరుతో కొందరు అపోహలు సృష్టిస్తూ రాజకీయాలు చేయడం సరికాదని, రైతులకు అండగా నిలిచేది ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. అనంతరం వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించిన ఎమ్మెల్యే, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ అధికారులు, స్థానిక నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







# శ్రీ చైతన్యా...? అరబిందోనా...?

### పేరు ఒకటి... ప్రచారం మరొకటి... నిర్వహణపై ప్రశ్నలే ప్రశ్నలు..!





**వర్ధన్నపేట/జులై 30 (జర్నలిస్ట్ వార్త):**
వర్ధన్నపేటలో గత మూడు సంవత్సరాలుగా నిర్వహణలో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాల తీరు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పాఠశాల పేరు విషయంలోనే అయోమయం నెలకొంది. బోర్డుపై ఒక పేరు, ప్రచారంలో మరో పేరు, విద్యార్థులకు ఇచ్చే పుస్తకాలపై ఇంకో పేరు కనిపిస్తుండటంపై తల్లిదండ్రులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఇది విద్యాశాఖ నిబంధనలకు అనుగుణమేనా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
పాఠశాలలో విద్యా ప్రమాణాల కంటే అధిక ఫీజుల వసూళ్లపైనే ఎక్కువ దృష్టి పెట్టినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రదర్శించాల్సిన ఫీజుల వివరాల బోర్డు పాఠశాలలో కనిపించకపోవడం గమనార్హం. దీంతో ఏ తరగతికి ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో తల్లిదండ్రులకు స్పష్టత లేకుండా పోతోందని చెబుతున్నారు. మరోవైపు పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉండడం, బురద పేరుకుపోవడం, బస్సులను అదే ప్రాంగణంలో నిలిపివేయడం, చెట్లు ఏపుగా పెరిగి ఉండడం వంటి పరిస్థితులు విద్యార్థుల భద్రతపై ఆందోళన కలిగిస్తున్నాయి. పాఠశాలకు తగిన ఆటస్థలం ఎక్కడ ఉందనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం కనిపించడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.
ముందుభాగంలోని గోడలను రంగురంగుల పెయింటింగ్‌లతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దినప్పటికీ, పక్కగోడలు మాత్రం పగుళ్లు, ఊడిపోయిన పెచ్చులతో నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. బయట కనిపించే అందం కంటే, లోపలి నిర్వహణపైనే దృష్టి పెట్టాలని వారు సూచిస్తున్నారు.
ఇదిలా ఉండగా, ఈ పాఠశాల భూమి బఫర్ జోన్ పరిధిలో ఉందనే ఆరోపణలు కూడా చాలా కాలంగా వినిపిస్తున్నాయి. దీనిపై సంబంధిత శాఖలు పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.
గత ఏడాది జిల్లా విద్యాశాఖాధికారి తనిఖీ నిర్వహించిన సమయంలో పుస్తకాలపై ముద్రించిన శ్రీ చైతన్య పేరును తొలగించినట్లు సమాచారం. ప్రస్తుతం పాఠశాల అసలు గుర్తింపు, అనుమతులు, నిర్వహణ విధానంపై స్పష్టత లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. పాఠశాల అధికారికంగా ఏ పేరుతో గుర్తింపు పొందింది? బోర్డు, ప్రచారం, పుస్తకాలపై వేర్వేరు పేర్లు ఎందుకు? ఫీజుల బోర్డు ఎందుకు ప్రదర్శించలేదు? ఆటస్థలం, భద్రతా ప్రమాణాలు ఉన్నాయా? బఫర్ జోన్ ఆరోపణల్లో వాస్తవం ఎంత? పాఠశాల నిర్వహణ విద్యాశాఖ నిబంధనలకు అనుగుణంగా ఉందా?
అనే విషయాలను విద్యా శాఖ అధికారులు గుర్తించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. విద్య అనేది వ్యాపారం కాకూడదు. విద్యార్థుల భద్రత, తల్లిదండ్రుల నమ్మకం, ప్రభుత్వ నిబంధనల అమలే ప్రధానంగా ఉండాలి. అందువల్ల జిల్లా విద్యాశాఖ, రెవెన్యూ, సంబంధిత అధికారులు సంయుక్తంగా సమగ్ర తనిఖీ నిర్వహించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి, నిబంధనల ఉల్లంఘనలు ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.




పాఠశాల ఆవరణంలో నిలిచి ఉన్న బురద నీరు

### మూడో అంతస్తు భవనంపై సందేహాలు

పాఠశాల భవనంలోని మూడో అంతస్తులో కొన్ని చోట్ల పెచ్చులు ఊడిపోవడం, గోడలకు చీలికలు కనిపిస్తున్నాయనే ఆరోపణలు స్థానికంగా చర్చకు దారితీశాయి. ఈ భవనం విద్యార్థుల వినియోగానికి పూర్తిస్థాయిలో సురక్షితమేనని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు లేదా విద్యాశాఖ అధికారుల నుంచి ధృవీకరణ ఉందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. వందలాది మంది విద్యార్థులు చదువుతున్న నేపథ్యంలో భవన భద్రతపై సంబంధిత శాఖలు సాంకేతిక తనిఖీ నిర్వహించి స్పష్టత ఇవ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

### ప్రిన్సిపల్ వివరణ

ఈ ఆరోపణలపై పాఠశాల ప్రిన్సిపల్‌ను వివరణ కోరగా, తమ పాఠశాలలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారమే విద్యా సంస్థను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎలాంటి అధిక ఫీజులు వసూలు చేయడం లేదని, తల్లిదండ్రుల నుంచి వచ్చిన ప్రతి అంశానికీ సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. పాఠశాల భవనం కూడా సురక్షితంగానే ఉందని, వివరించారు.




బఫర్ జోన్ ఉందా లేదా అని సర్వే చేస్తున్న రెవెన్యూ జిపిఓ లైసెన్స్ సర్వీస్